# "నరకంలో మల్లాది"

ఆ రోజు యమధర్మరాజు కొలువుదీరి వున్నాడు. వారి వారి పాపాలను బట్టి మానవులకు శిక్షలు విధిస్తున్నాడు. అంతా అయిపోయాక ఒకాయన వచ్చాడు.

"చిత్రగుప్తా, ఈ మానవుని చిట్టా తిరగవేసి పాప పుణ్యాలను బేరీజు వేయుము" అన్నాడు యముడు.

"ఇతని పేరు మల్లాది వెంకట కృష్ణమూర్తి స్వామి. మంచి నవలలు రాసి తెలుగు పాఠకులకు చక్కని వినోదాన్ని అందించాడు" చెప్పాడు చిత్ర గుప్తుడు.

"అటులైనా, మరి పాపముల సంగతియో"

"ఇతను తమ పేరుమీద 'యమపాశం' అనే నవల రాసాడు స్వామి. అందులో మన గురించి లేక పోయినా, ఆ తరువాత రాసిన 'యమాయనమః' అనే నవలలో మన గురించి చాలా చీప్‌గా రాసాడు".

"ఆహా! మా మీదే నవలలు రాసితివా! చిత్ర

యమాయనమః

గుప్తా, ఇతనికి ఏమి శిక్ష వేయుదుము? ఎండా కాలం వారం రోజులు స్నానం లేకుండా వుంచి మలక్ పేటలో ఆరుబయట పట్టి కట్ డ్రాయర్ మీద పడుకోబెడదామా? లేక ఎయిర్ ఇండియా టాయ్ లెట్‌లో ఓ రెండు రోజులు వుంచుదామా?" అడిగాడు యముడు.

"వద్దులెండి స్వామి, ఎంత మన మీద నవల రాసినా తెలుగు పాఠకులకు విందు చేసాడు కదా! స్టార్ హోటల్‌లో వద్దు గానీ, మామూలు లాడ్జిలో రూం ఇద్దాం" అన్నాడు చిత్రగుప్తుడు.

"మానవా నువ్వు తెలుగు పాఠకులకు చేసిన సహాయం దృష్టిలో పెట్టుకొని నీకు 'లాడ్జి చిత్ర గుప్త'లో రూం ఇస్తున్నాను" అన్నాడు యముడు మల్లాది కేసి తిరిగి.

స్టార్ హోటల్ రూం ఇస్తాడని ఆశపడిన మల్లాది మెల్లిగా అనుకున్నాడు - "యమ పిండం".

[అంకితం: క్షమార్పణలతో "మల్లాది"కి]

—సరిదే సుబ్రహ్మణ్యం

## జాతీయత



ఒకసారి విక్టోరియా మహారాణి ఆస్ట్రియా (వియన్నా) దేశపు గాయకుడిని తన అంతఃపురానికి పిలిపించింది. ఆ గాయకుడి అద్భుత సంగీతాన్ని విని- విక్టోరియా మహారాణితోపాటు సభలోని వారందరూ ఎంతో అభినందించారు. మహారాణి ఆ గాయకునికి వజ్రపు పిన్నును బహుమతిగా ఇచ్చి ఇలా అంది- "మీరు మీ దేశపు జాతీయ సంగీతాన్ని ఆలపించండి" అని కోరింది. గాయకుడు వెంటనే రాష్ట్రీయ గీతాన్ని (తన ఆస్ట్రియా దేశపు) ఆలాపించాడు. ఆ రాష్ట్రీయ గీతాన్ని ప్రారంభిస్తూ వుండగానే విక్టోరియా రాణి లేచి నిల్చుంది. ఆమె లేవగానే సభలోని వారంతా లేచి నిల్చున్నారు. రాష్ట్రీయ గీతం సమాప్తం కాగానే గాయకుడు తన సజల నయనాలను తుడుచుకుంటూ సంతోషంతో ఇలా అన్నాడు: "మహారాణీ! నా రాష్ట్ర గీతాన్ని ఆలపించే సమయంలో మీరంతా గౌరవపూర్వకంగా లేచి నిల్చున్నారే-ఇది మొదట మీరు నాకిచ్చిన వజ్రాలతో తయారుచేసిన పిన్ కంటె ఎన్నో కోట్ల రెట్లు విలువైనది" అని అన్నాడు.

— వాగాపురం నాగేశ్వరరావు

## 'మునిమాణి'క్యాలు



గ్రంథకర్త: సమకాలికులనూ స్నేహితులనూ విసిగించడంతో తృప్తిపడక ముందు తరాల వారినీ ఏడిపించడానికి ప్రయత్నించేవాడు.

మూర్ఖుడు: తాను తప్ప మిగిలిన వారంతా తెలివి తక్కువ వాళ్ళు అనుకునేవాడు.

ఎవరూ నమ్మని విషయం: నీ అభిప్రాయాలకు వ్యతిరేకమైన విషయం.

అప్పిచ్చువాడు: అప్పు పుచ్చుకున్నవాడికంటే ఎక్కువ జ్ఞాపక శక్తికలవాడు.

నేరస్తుడు: తప్పుచేసి, పట్టుబడినవాడు

మంచి సలహా: నీవు ఇదివరకే నిశ్చయించుకున్నదాన్ని ఎవరైనా మెచ్చుకుంటే అది మంచి సలహా అవుతుంది.

పొగడ్త: తినేవాడికి తప్ప ఇతరులకు అసహ్యం కలిగించే తిండి

'హాస్య కుసుమావళి' నుంచి

—ద్వివేది ఉమామహేశ్వరరావు

## సమస్యాపూరణం

12-1-90 సంచికలో ఇచ్చిన సమస్యకు అసంఖ్యాకంగా చక్కని పూరణలు మాకు చేరాయి. అత్యుత్తమ ఎంట్రీలు రెండింటిని ఇక్కడ ప్రచురిస్తున్నాము. విజేతలకు అభినందనలు. చెరి పాతిక రూపాయల నగదు బహుమతిని వీరిద్దరికి పంపే ఏర్పాటు చేసాము.

- ఎడిటర్

సమస్య: వాయిదా

బాగా చదివి సిద్ధమైతే పరీక్షలు
వాయిదా ఇంటర్వ్యూ బాగా చేస్తే
ఎంపిక వాయిదా ఉత్తర దక్షిణాలు
ముట్టజెప్పినా ఉద్యోగం వాయిదా
మధ్య తరగతివాడి కోర్కెలు తీరడం
మళ్ళీ జన్మకు వాయిదా

-జి. సూర్యకాంతం, జగ్గన్నపేట

* కట్నం ఎక్కువడిగారని కన్న
కూతురి పెళ్ళికి వేస్తాడు వాయిదా
కొడుక్కి రావలసిన కట్నం
లేటయితే కసాయి వాడిలా
వసూలు చేస్తాడు అసలుకు
ఫాయిదా

- గుబ్బల మాధవమూర్తి,
మానేపల్లి

ఈ వారం సమస్య
జన్మభూమి
గడువు తేదీ
జనవరి 24

సమస్యను పూరించండి-రూ. 50 గెలుపొందండి!